# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 07 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 339 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## రైతన్నలు... కాళ్ళు పట్టుడు బంద్ చేసి

# కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టండి

దండం పెట్టడం కాదు కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి..

అట్లైతేనే రైతులకు మంచి రోజులు వస్తాయి

తాలు తీస్తే..రైతులు నీ తోలు తీస్తారు రేవంత్ రెడ్డి

మక్కలు కొనకపోతే నీ కాంగ్రెస్ ప్రభుత్వం

వెయ్యి ముక్కలు అవుతుంది

వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్

రైతు సంగ్రామ సదస్సులో నాలుగు తీర్మానాలు చేసిన బీఆర్ఎస్

రైతులు కాంగ్రెస్ నయవంచనకు బలికావద్దు

గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని పిలుపు

**వరంగల్,మే06(తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ జిల్లా కాకతీయ పౌరుషాల గడ్డ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇది త్యాగాల గడ్డ, పోరాటాల గడ్డ అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ కదం తొక్కిందని గుర్తుచేశారు. వరంగల్‌లో ఏం ప్రారంభించినా విజయవంతమవుతుందని తెలిపారు. వరంగల్‌లో పోరాటాల విల్లు ఎక్కుపెడితే ద్రోహుల గుండెలు జల్లుమంటాయని వ్యాఖ్యానించారు. హనుమకొండలో బుధవారం నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రైతుల ఓట్ల కోసం కాంగ్రెస్ నేతలు గాలం వేసారని ఆరోపించారు. వరంగల్ గడ్డపైనే రైతు డిక్లరేషన్ ప్రకటించి పెద్ద ఎత్తున హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు పెద్ద దొంగలని విమర్శించిన ఆయన, రాహుల్ గాంధీ వరంగల్ సభలో దొంగ హామీలు ఇచ్చారని ఆరోపించారు. రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన 34 హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు. బాండ్ పేపర్లు రాసి మరీ ప్రజలను మభ్యపెట్టారని, ఆ హామీలు నమ్మి రైతులు కాంగ్రెస్‌కు ఓటేశారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయినా రైతు డిక్లరేషన్ ఊసే లేదని కేటీఆర్ విమర్శించారు. రైతు డిక్లరేషన్‌పై ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు మాట్లాడటం లేదని అన్నారు. రైతులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు, ఎగవేతల రేవంత్ రెడ్డి అని విమర్శించారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టు పెట్టి రుణమాఫీ చేస్తానని చెప్పారని గుర్తుచేశారు.

మిగతా 2లో..



### రైతు సంగ్రామ సదస్సులో నాలుగు తీర్మానాలు చేసిన బీఆర్ఎస్

**రైతులు కాంగ్రెస్ నయవంచనకు బలికావద్దని.. గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతు సోదరులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. రెండేళ్లలో రాబంధు రాజ్యం పోయి.. రైతుబంధు కేసీఆర్ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు సంగ్రామ సదస్సులో రైతుల పక్షాన నాలుగు తీర్మానాలు చేస్తున్నామని ప్రకటించారు.**

**1. కాంగ్రెస్ రాబంధు పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని.. రోడ్డున పడ్డ ఒక్కో రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.**

**2. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన 34 హామీలను వెంటనే అమలు చేయాలి.**

**3. అన్ని పంటలను ఆంక్షలు లేకుండా రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలి.**

**4. రెండు లక్షల రుణమాఫీ పూర్తి కాని రైతులకు రుణ విముక్తి కల్పించాలి. రైతుబంధు సక్రమంగా వేయాలి. రైతు బీమా పథకాలను వెంటనే పునరుద్ధరించాలి.**

**రైతు సంగ్రామ సదస్సులో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.**



## అర్ధరాత్రి బస్టాండ్‌లో సాధారణ మహిళగా సీపీ సుమతి

- పోకిరీల ఆట కట్టింపు
- మహిళల భద్రతపై ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించిన మల్కాజ్‌గిరి సీపీ
- బస్టాండ్‌లో మహిళలను వేధిస్తున్న దాదాపు 40 మంది యువకుల గుర్తింపు
- సాధారణ మహిళ వేషంలో ప్రత్యక్షంగా పరిస్థితుల పరిశీలన
- అదుపులోకి తీసుకున్న పోకిరీలకు కౌన్సెలింగ్.. మళ్లీ తప్పిదం చేస్తే కఠిన చర్యల హెచ్చరిక

**హైదరాబాద్,మే6(తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన సీపీ సుమతి నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్ చర్చనీయాంశంగా మారింది. మహిళలు బహిరంగ ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న వేధింపులపై ప్రత్యక్ష అవగాహన పొందేందుకు ఆమె సాధారణ మహిళ వేషంలో అర్ధరాత్రి సమయంలో బస్టాండ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. సాధారణ మహిళలా అక్కడ నిలుచున్న సమయంలో కొందరు యువకులు అనుమానాస్పదంగా వ్యవహరిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిసింది. మహిళలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్న గుంపులను గుర్తించేందుకు ముందస్తుగా అప్రమత్తంగా ఉన్న పోలీసు బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి.

మిగతా 2లో..

## ఫీజుల దోపిడీపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ

రౌండ్ టేబుల్ సమావేశంలో కల్వకుంట్ల కవిత

ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం

మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్



**హైదరాబాద్, మే 06 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన "నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణ" రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థ, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపు, ప్రభుత్వ బాధ్యతలపై ఆమె తీవ్ర స్థాయిలో స్పందించారు. ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపుపై ప్రభుత్వం స్పందించడం లేదని కవిత విమర్శించారు. కొన్ని పాఠశాలలు యాభై శాతం నుంచి నూట ఇరవై శాతం వరకు ఫీజులు పెంచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో..

## వైద్య ఆరోగ్యశాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ

- త్వరలో ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఫలితాలు విడుదల
- విద్య, వైద్యం, మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం
- నారాయణఖేడ్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ



2లో

## కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్

- రాహుల్ గాంధీపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- రైతు సమస్యలపై చర్చకు సిద్ధమని కాంగ్రెస్ నేతలు వెల్లడి
- బీజేపీ–బీఆర్ఎస్ ఒకే తీరుగా వ్యవహరిస్తున్నాయని విమర్శ



2లో

## మెట్రో ఫేజ్-2కు సీఎం విజ్ఞప్తి

- కేంద్ర మంత్రి ఖట్టర్‌తో రేవంత్ రెడ్డి కీలక సమావేశం
- ఏడు కారిడార్లతో భారీ విస్తరణ ప్రణాళిక
- హైదరాబాద్ భవిష్యత్ రవాణాపై ప్రత్యేక దృష్టి



**ఢిల్లీ, మే 06 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టుకు తక్షణ ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కోరారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతన్నలు... కాళ్ళు పట్టుడు బంద్ చేసి
# కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టండి

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వెళ్లి రైతులందరికీ రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చారానా, టోపీ బారానా అయిందని ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగుతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో దందాలు, కమీషన్లు, కొట్లాటలే నడుస్తున్నాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి పలుమార్లు ఢిల్లీకి వెళ్లినా రాష్ట్రానికి నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రాహుల్ బంధు నడుస్తోందని, రైతులు, ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులను నంబర్‌వన్ స్థానంలో నిలిపారని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి చేసిందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశామని, దేశంలో రైతును అత్యంతగా ఆదుకున్న నాయకుడు కేసీఆర్ అని అన్నారు. పదేళ్లలో రైతుల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తెలిపారు. కేసీఆర్ హయాంలో సాగుభూములు పెరిగి వరంగల్ ప్రాంతంలో భూముల ధరలు కూడా పెరిగాయని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువలు పడిపోయాయని విమర్శించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు వానల్లో, ఎండల్లో పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు రైతులు మృతి చెందిన ఘటనను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత పరిస్థితులు వస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు.

# అర్ధరాత్రి బస్టాండ్‌లో సాధారణ మహిళగా సీపీ సుమతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆపరేషన్‌లో దాదాపు 40 మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, బస్టాండ్‌లు, ప్రజా రవాణా కేంద్రాలు, రాత్రి వేళల్లో మహిళలు ఎక్కువగా ప్రయాణించే ప్రాంతాల్లో వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిలో కొందరు మహిళలను అనుసరించడం, అసభ్య వ్యాఖ్యలు చేయడం, అనుచితంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడినట్లు గుర్తించినట్లు సమాచారం.

అనంతరం వారందరికీ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అవసరమైతే చట్టపరమైన కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఇటీవల మహిళల భద్రతపై రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్న తరుణంలో మల్కాజ్‌గిరి కమిషనరేట్ నిర్వహించిన ఈ ఆపరేషన్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. షీ టీమ్స్ తరహాలో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించే చర్యలను మరింత విస్తరించే అవకాశముందని సమాచారం.

# కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్

**హైదరాబాద్, మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ లాంటి మానవతా హృదయం కలిగిన నాయకుడు దేశంలో దొరకడం కష్టమని పేర్కొన్నారు.

అభివృద్ధి విషయంలో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేటీఆర్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధాన్యం, మొక్కజొన్న, వరి కొనుగోళ్లపై ప్రభుత్వం నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసిందని, రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలా విడతల వారీగా కాకుండా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేశామని తెలిపారు.

వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులకు సబ్సిడీపై ఆధునిక యంత్రాలు అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా ద్వారా కూడా అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల్లో వరుస పరాజయాలతో బీఆర్ఎస్ నైరాశ్యంలో ఉందని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

రైతు సమస్యలపై చర్చకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల ఆత్మహత్యలు, గౌరవెల్లి, మల్లన్నసాగర్ ఘటనల సమయంలో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరును ప్రజలు మర్చిపోలేదన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోలు వ్యవహారాలపై విచారణ జరుగుతోందని, నిజాలు బయటకు రావాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

# వైద్య ఆరోగ్యశాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ

**సంగారెడ్డి, మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో సుమారు పద్దెనిమిది వేల ఉద్యోగాల భర్తీ చేపట్టామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. మల్టీపర్పస్ ఏఎన్ఎంలు, నర్సింగ్ ఆఫీసర్ల నియామక ఫలితాలను అతి త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తొంభై తొమ్మిది రోజుల కార్యాచరణ అమలు కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసదనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలసదనం నూతన భవనాన్ని మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ సురేష్ షెట్కర్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్యం, మహిళా సాధికారత, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు, శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలు, బాలసదనాలను కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల బలోపేతానికి ప్రభుత్వ నిధులతో పాటు సంస్థల సామాజిక బాధ్యత నిధులను వినియోగించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల కోసం పక్కా భవనాల నిర్మాణం, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీల ద్వారా పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య పరీక్షలు, రోగనిరోధక సేవలు ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.

కార్యక్రమంలో పాల్గొన్న బాలసదనం బాలికలతో మంత్రి ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాలసదనంలో తక్షణమే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దివ్యాంగులకు స్కూటీలను పంపిణీ చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణ సంస్థల పరిశుభ్రత, ఆరోగ్య శిబిరాలు, పునరావాస కార్యక్రమాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలు వంటి అంశాలపై చేపడుతున్న చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్, మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, మున్సిపల్ కమిషనర్ ప్రశాంత్, సీడీపీవో సుజాత, ఆశ్రమ నిర్వాహకురాలు విజయ కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మెట్రో ఫేజ్-2కు సీఎం విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)



ఢిల్లీలో జరిగిన ఈ కీలక సమావేశంలో మెట్రో ఫేజ్ 2, ఫేజ్ 3 విస్తరణ ప్రణాళికలపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరం రోజురోజుకు విస్తరిస్తోందని, పెరుగుతున్న జనాభా, వాహన రద్దీ కారణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన, పర్యావరణహిత రవాణా సౌకర్యాలు అందించేందుకు మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించి కేంద్రానికి సమర్పించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ చేపట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టుకు సుమారు రూ.38,595 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు వెల్లడించారు. ఫేజ్ 2 ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం లభిస్తే నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వెనుక ప్రధాన ఉద్దేశం మెట్రో విస్తరణ పనులను మరింత వేగవంతం చేయడమేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఫేజ్ 1 ప్రభుత్వ పరిధిలో ఉండటంతో ఫేజ్ 2, ఫేజ్ 3 విస్తరణ కార్యక్రమాలు సులభంగా అమలు చేయగలమని వివరించారు. భవిష్యత్ నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆర్జీఐ విమానాశ్రయం నుంచి "భారత్ ఫ్యూచర్ సిటీ" వరకు మెట్రో ఫేజ్ 3ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కూడా కేంద్రానికి ఇప్పటికే సమర్పించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మెట్రో నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. మెట్రో విస్తరణతో నగరంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా దోహదం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఐటీ కారిడార్లు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, నివాస ప్రాంతాలను అనుసంధానించే విధంగా మెట్రో మార్గాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె. శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ పూర్తయితే నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రావడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. మెట్రో నెట్‌వర్క్ విస్తరణ ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని అధికారులు వెల్లడించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం



- రైతుల సమస్యలపై వెంటనే స్పందన
- జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి
- బారదాన్, టార్పాలిన్ కొరత లేకుండా చర్యల ఆదేశం

**సిద్దిపేట, మే-06 (తెలంగాణ ముచ్చట్లు):** హుస్నాబాద్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా కోహెడ మండలం బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం తరలింపులో జాప్యం, బారదాన్, టార్పాలిన్ కొరత వంటి సమస్యలను రైతులు వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ హైమావతితో ఫోన్‌లో మాట్లాడి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బారదాన్, టార్పాలిన్ కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని సకాలంలో విక్రయించుకునేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని అధికారులు వెల్లడించారు.

# ఫీజుల దోపిడీపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత విద్య, ఉచిత వైద్యం ప్రభుత్వాల బాధ్యతేనని ఆమె స్పష్టం చేశారు. సమానత్వం, స్వేచ్ఛ, మానవ విలువలు విద్య ద్వారానే సాధ్యమని ప్రపంచం గుర్తించిందన్నారు. పిల్లల చదువు బాధ్యత కేవలం తల్లిదండ్రులదే కాదని, ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రస్తుతం అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో నడుస్తున్నాయని కవిత ఆరోపించారు. రాజకీయ నాయకులకు చెందిన విద్యాసంస్థలే ఎక్కువగా ఉన్నాయని, విద్యను వ్యాపారంగా మార్చడం ఆందోళనకరమని అన్నారు. ఫీజుల దోపిడీకి తక్షణ పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో అరవై నాలుగు లక్షల మంది విద్యార్థుల్లో ఎక్కువ శాతం ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారని ఆమె తెలిపారు. పిల్లలు బాగా చదువుకోవాలన్న తల్లిదండ్రుల బలహీనతను కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపారంగా మార్చుకున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేసి గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఈ ఏడాది నూట ఇరవై శాతం ఫీజులు పెంచడాన్ని కవిత తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న పాఠశాలలోనే ఇంత భారీగా ఫీజులు పెరగడం దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వేల కోట్ల రూపాయల మేర పేరుకుపోయాయని కవిత పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని బలహీనపరిచేలా తీసుకొచ్చిన జీవోలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్య, వైద్యం విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని ఆమె స్పష్టం చేశారు. తమిళనాడు తరహాలో ఫీజుల నియంత్రణకు శాశ్వత అథారిటీ ఏర్పాటు చేయాలని, లేదా గుజరాత్ మాదిరిగా ఫీజులకు పరిమితి విధించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. విద్య, వైద్యం అంశాల్లో ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కవిత కోరారు.

# గడ్డి కట్టే యంత్రంలో చిక్కుకుని వ్యక్తి దుర్మరణం



**భీమదేవరపల్లి,ఏప్రిల్ 6(తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగపూర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రచ్చ సంపత్ (51) గడ్డి కట్టలు కట్టే యంత్రం (బేలర్ మెషిన్)లో పని చేస్తుండగా ఈరోజు మధ్యాహ్నం సుమారు 12:30 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు యంత్రంలో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యంత్రంలో పనిచేసేటప్పుడు జాగ్రత్తలు పాటించకపోవడం లేదా సాంకేతిక లోపం కారణమా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ దుర్ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మృతుడికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీటి నివాళులు అర్పించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు బంగారు భవిష్యత్తు



- ప్రత్యామ్నాయ పంటలతో స్థిర ఆదాయం సాధ్యం
- డా. జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,మే6(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రైతు వారోత్సవాల సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. అధిక వంటనూనె దిగుబడిని ఇచ్చే పంటలలో ఆయిల్ పామ్ ప్రధానమని తెలిపారు. దేశంలో పెరుగుతున్న వంటనూనె అవసరాల దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీలు, డ్రిప్ సిస్టమ్, ఎరువులు, రవాణా వంటి సౌకర్యాలు కల్పిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు.ఆయిల్ పామ్ తోటల్లో కోకో, జాజికాయ వంటి అంతర పంటలు సాగు చేస్తే రైతులకు ఏడాది పొడవునా స్థిర ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు.మూడు సంవత్సరాల తర్వాత దిగుబడి వచ్చే ఈ పంటకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు.ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగును కూడా ప్రోత్సహిస్తోందని, రైతులు మొక్కజొన్న, పత్తి, ఆముదం, కూరగాయల సాగు ద్వారా అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. సంకిరెడ్డిపల్లి, బీచ్‌పల్లి ప్రాంతాల్లో కొత్త ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, రిటైర్డ్ వ్యవసాయ అధికారి కృపాకర్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి విజయభాస్కర్ రెడ్డి, శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి, వీణ జోషి, కాంగ్రెస్ నాయకులు, రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌కు గుడ్‌బై.. బీఆర్ఎస్‌లో చేరిన మనిగిల్ల గ్రామ నాయకులు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**పెద్దమందడి,మే6(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంచరమోని వెంకటయ్య, సుంచరమోని తిరుపతయ్య, పెద్ది రాఘవేందర్ సాగర్‌లు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో వారు పార్టీ కండువా కప్పుకుని బీఆర్ఎస్‌లో చేరగా, ఆయన వారికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పని చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి పలువురు నాయకులు తిరిగి బీఆర్ఎస్ వైపు వస్తున్నారని అన్నారు.కార్యక్రమంలో మనిగిల్ల గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక వెల్లువ..

- శ్రీవారి సన్నిధిలో వైభవంగా 'మహా కుంభాభిషేకం'
- సతీసమేతంగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం బ్యూరో, మే 6(తెలంగాణ ముచ్చట్లు ):** భక్తి భావం వెల్లివిరిసింది.. వేద మంత్రం జయజయధ్వానమై ప్రతిధ్వనించింది.. అన్నపురెడ్డిపల్లి శ్రీశ్రీశ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం బుధవారం ఆధ్యాత్మిక కోలాహలంగా మారింది. లోక కల్యాణార్థం నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి దంపతులు పాల్గొన్నారు. పరమపూజ్య శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వారి దివ్య పర్యవేక్షణలో జరిగిన ఈ క్రతువుతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక పారవశ్యంలో మునిగిపోయింది.

వేదోక్తంగా కుంభాభిషేక క్రతువు బ్రహ్మ ముహూర్తం నుంచే అర్చక బృందం హోమగుండాల వద్ద జపాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం చినజీయర్ స్వామి వారి దివ్య హస్తాల మీదుగా కలశాలకు పవిత్ర జలాలతో అభిషేకం చేస్తుండగా, భక్తుల గోవింద నామస్మరణతో దిక్కులు పిక్కటిల్లాయి. ఈ మహోన్నత ఘట్టాన్ని మంత్రి పొంగులేటి దంపతులు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. అనంతరం జరిగిన వేదాశీర్వచన కార్యక్రమంలో పండితులు మంత్రి దంపతులకు స్వామివారి శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందజేసి దీవించారు.

ప్రజల క్షేమం కోరి పూజలు

దర్శనానంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "చినజీయర్ స్వామి వారి పావన హస్తాల మీదుగా ఈ కుంభాభిషేకం జరగడం మనందరి అదృష్టం. స్వామివారి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని మనసారా ప్రార్థించాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయ బాబు, జిల్లా కలెక్టర్ అంకిత్, డీసీసీ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లారీలు లేవు... గోదాములు లేవు... రైతుల పంటకు దారి లేదు!



**జమ్మికుంట టౌన్ మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట కొత్త మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం రైతులకు ఆశగా మారాల్సింది పోయి ఆందోళనకు కారణమైంది. వారం రోజులుగా తమ పంటను విక్రయించేందుకు వచ్చిన రైతులు కేంద్రం వద్దే పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి బుధవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ——ఏప్రిల్ 29న అట్టహాసంగా ప్రారంభించిన కొనుగోళ్లు ఇప్పటికీ 10 శాతం కూడా పూర్తికాలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “పంట చేతికొచ్చింది... కానీ మార్కెట్‌లో అమ్మే పరిస్థితి లేదు” అంటూ రైతుల బాధను వ్యక్తం చేశారు.

సుమారు 30 వేల క్వింటాళ్ల మొక్కజొన్న కేంద్రానికి చేరినా, లారీలు లేకపోవడం, గోదాములు సరిపోకపోవడం వల్ల బస్తాలు పేరుకుపోతున్నాయని తెలిపారు. తూకం వేసిన ధాన్యం కూడా రోజులు గడిచినా లిఫ్ట్ చేయకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అకాల వర్షాల హెచ్చరికల మధ్య రైతులు భయాందోళనలో ఉన్నారని, ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితిలో పంటను కాపాడుకోవడం కష్టమవుతోందని చెప్పారు. “ఇలాంటి పరిస్థితుల్లో కొనుగోళ్లు యుద్ధ ప్రాతిపదికన జరగాలి... కానీ ఇక్కడ మాత్రం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది” అని విమర్శించారు.

మార్క్‌ఫెడ్ వద్ద సిబ్బంది కొరత కూడా ప్రధాన సమస్యగా మారిందని, వెంటనే అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. థంబ్ ఇంప్రెషన్ సమస్యల వల్ల అనేక మంది రైతులు మద్దతు ధరకు అమ్ముకోలేకపోతున్నారని, దీనికి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు.

మార్కెట్‌లో కనీస మద్దతు ధరకు, బయట మార్కెట్ ధరకు క్వింటాలుకు సుమారు రూ.700 తేడా ఉండటంతో మధ్య దళారులు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి మండలానికి ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి అధికార పార్టీ, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని, రాజకీయాలకు అతీతంగా రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్, శీలం అశోక్, కాయిత లింగారెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్‌తో పాటు గుండారపు కుమారస్వామి, ఉప్మే మల్ల సంజీవ్, సమ్మయ్య, భూమి రెడ్డి, రజిత, రాజిరెడ్డి, రాజేశ్వరరావు, మల్లయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా కోర్టులో భూగర్భ జలాల పెంపునకు శ్రీకారం

- 'రూఫ్‌టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్' వ్యవస్థ ప్రారంభం



**ఖమ్మం బ్యూరో, మే 6(తెలంగాణ ముచ్చట్లు ):** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ (వర్షపు నీటి సంరక్షణ) వ్యవస్థను బుధవారం ఘనంగా ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ జి. రాజా గోపాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ ప్రాజెక్టును ప్రారంభించారు.

భూగర్భ జలాల పెంపునకు స్వేచ్ఛ ఎన్జీఓ కృషి సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీ చల్లా కోటయ్య , స్వేచ్ఛ ఎన్జీఓ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిర్మాణాన్ని చేపట్టారు. భవనం పైకప్పు నుంచి వచ్చే వర్షపు నీటిని వృథా పోనివ్వకుండా, శాస్త్రీయ పద్ధతిలో భూగర్భంలోకి పంపడం ద్వారా కోర్టు ప్రాంగణంలో జలవనరులను మెరుగుపరచడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

"భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని, ప్రతి నీటి చుక్కను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కోర్టు ప్రాంగణంలో ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయడం ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఆదర్శప్రాయం."

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎడ్లపల్లి రమేష్,జనరల్ సెక్రటరీ కొప్పుల రవి కుమార్ తెలంగాణా బార్ కౌన్సిల్ సభ్యులు మందడపు శ్రీనివాసరావు ,EC మెంబెర్స్, మరియు మరియు సీనియర్, జూనియర్, మహిళ న్యాయవాదులు,ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కి స్వేచ్ఛ స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు ప్రత్యేక ధన్యవాదములు తెలియపరిచారు.

# ప్రమాదంతో నష్టపోయిన రైతులకు అండగా ప్రణవ్... 'కాంగ్రెస్ ప్రభుత్వం మీతోనే ఉంది' అని భరోసా

- త్వరితగతిన నష్టపరిహారం అందించాలని ఆదేశాలు



**జమ్మికుంట రూరల్ మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** వావిలాల నుంచి వంతడుపుల వెళ్లే రహదారిపై జరిగిన ప్రమాదంలో నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ భరోసా ఇచ్చారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అధికారులను అప్రమత్తం చేసి రైతులను ఆదుకోవాలని సూచించినట్లు తెలిపారు. బుధవారం సంఘటన స్థలానికి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి చేరుకున్న ప్రణవ్, నష్టపోయిన రైతులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు, పంట నష్టం వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రణవ్‌ను చూసిన రైతులు భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమవ్వగా, వారిని ఓదార్చుతూ ధైర్యం చెప్పారు. “ఇది రైతు ప్రభుత్వం... రైతులకు ఎలాంటి కష్టం రానివ్వం. మీరు అధైర్యపడ వద్దు, మేమున్నాం” అంటూ భరోసా కల్పించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నష్టపరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వావిలాల సర్పంచ్ అర్జున్, తనుగుల సర్పంచ్ కిరణ్, మార్కెట్ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు మెలుగురీ సదయ్య, మండల, పట్టణ అధ్యక్షులు పరశురామ్, రమేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సజ్జు, సీనియర్ నాయకులు దేశిని కోటి, రాకేష్ రెడ్డి, సాయిని రవి, పూరేళ్ళ రాకేష్, పొనగంటి మధు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ పరిశీలనలో ఉంది

- **ఎంపీ వద్దిరాజు వినతికి స్పందన**
- **ప్రత్యుత్తరం రాసిన రైల్వే మంత్రి వైష్ణవ్**

**ఖమ్మం బ్యూరో,మే 6, (తెలంగాణ ముచ్చట్లు ):** భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేసే అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు రాసిన లేఖలో రైల్వే డివిజన్ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ ఏర్పడి వందేళ్లకు చేరువవుతున్న సందర్భంగా, దాని చారిత్రక నేపధ్యాన్ని వివరిస్తూ.. కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు ఎంపీ రవిచంద్ర వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం నుంచి కిరండోల్, మల్కాన్ గిరి, కొవ్వూరు రైల్వే లైన్లు ఏర్పడితే తెలంగాణ, ఛత్తీస్ ఘడ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉంటుందని ఆయన మంత్రికి వివరించారు. ఈ వినతికి స్పందించిన అశ్విని వైష్ణవ్ ఈ సూచనను రైల్వే ఉన్నతాధికారుల పరిశీలనకు పంపామని, పూర్తికాగానే తదుపరి చర్యలు చేపడతామని కేంద్రమంత్రి ఎంపీ రవిచంద్ర కు రాసిన ప్రత్యుత్తరం లో బదులిచ్చారు.




# లేబర్ కార్డు రెన్యువల్ తప్పనిసరి ఉప కార్మిక కమిషనర్ కోల ప్రసాద్

**హుజురాబాద్, మే 06(తెలంగాణ ముచ్చట్లు ):** కార్మికులు తమ లేబర్ కార్డులను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉప కార్మిక కమిషనర్ కోల ప్రసాద్ సూచించారు. బుధవారం హుజురాబాద్ పట్టణంలోని స్థానిక హైస్కూల్ క్రీడా మైదానంలో మే డే ఉత్సవాల సందర్భంగా కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధి పొందాలంటే లేబర్ కార్డు చెల్లుబాటు ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. గడువు ముగిసిన కార్డులను వెంటనే పునరుద్ధరించుకోవాలని కార్మికులకు సూచించారు.

రెన్యువల్ చేయించుకోని పక్షంలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్మికులు తమ సమస్యలను నేరుగా కార్మిక శాఖ అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఇంచార్జ్ కార్మిక శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, మధు, నాయకులు కోయల్కర్ బాలాజీ, సామాజిక కార్యకర్త నలబాల వేణుగోపాల్‌తో పాటు వివిధ సంఘాల కార్మిక నేతలు, కార్మికులు పాల్గొన్నారు.



# హైకోర్టు తీర్పుతో పదవిలోకి మళ్లీ వచ్చిన నాయకత్వానికి గౌరవాభివందనం

**జమ్మికుంట టౌన్ మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) చైర్మన్‌గా తిరిగి పదవీ బాధ్యతలు స్వీకరించిన పొనగంటి సంపత్‌ను తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల నాయకుడు, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను కూడా అభినందిస్తూ, సంఘం అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

తీర్పు ద్వారా న్యాయం సాధించినందుకు సంతోషం వ్యక్తం చేసిన రాజేశ్వర్ రావు, రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, సభ్యులు పాల్గొని సంపత్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# శివాజీ ఆశయాలు యువతకు మార్గదర్శకం

## డా.జిల్లెల చిన్నారెడ్డి



**గోపాలపేట,మే6(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా గోపాలపేట మండలం బుద్ధారం గ్రామంలో గ్రామ శివాజీ యూత్, గ్రామ యువత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజు విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికసంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ శివాజీ మహారాజు ధైర్యసాహసాలు, దేశ భక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. అణగారిన వర్గాల రక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. శివాజీ పరిపాలనలో లౌకికవాదానికి పెద్దపీట వేయడంతో పాటు మహిళలకు గౌరవం కల్పించిన గొప్ప నాయకుడిగా నిలిచారని తెలిపారు. స్వదేశాభిమానం, పరిపాలనా నైపుణ్యం కలిగిన నాయకుడిగా శివాజీ యువతకు స్ఫూర్తి చిహ్నమని పేర్కొంటూ, ఆయన జీవితం నుంచి యువత స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. శివాజీ విగ్రహావిష్కరణకు కృషి చేసిన శివాజీ యూత్ సభ్యులు, గ్రామ యువతను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శేఖర్ గౌడ్, ఉప సర్పంచ్ శివాజీ, మాజీ సర్పంచ్ అచ్చిత రామారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల ముంగిటకే ప్రజాపాలన

- **అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు**
- **మే నెలాఖరుకు రెండో విడత మంజూరు**
- **35 రోజుల్లోనే సాదా బైనామా సమస్యల పరిష్కారం**
- **రైతులకు రుణమాఫీ, మద్దతు ధరతో కొండంత అండ**
- **గువ్వలగూడెం ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ఖమ్మం బ్యూరో, మే 6(తెలంగాణ ముచ్చట్లు):** "రాష్ట్రంలో పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు లేకుండా, పాలనను నేరుగా వారి గడప వద్దకే తీసుకువచ్చాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో నిర్వహించిన 'ప్రజాపాలన ప్రజాదర్బార్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ దివాకరతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

రైతు పక్షపాతి మన ప్రభుత్వం...

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొందని విమర్శించారు. "నాడు వరి వేస్తే ఉరి అన్న పరిస్థితి ఉండేది. కానీ నేడు ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నాం. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం" అని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.21 వేల కోట్ల రుణమాఫీతో 25 లక్షల మంది రైతులకు విముక్తి కల్పించామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల సాయం అందిస్తున్నామని వివరించారు.

సొంతింటి కల సాకారం...

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు లేని నిరుపేదలకు గృహ కల్పన చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. "ఇప్పటికే పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేశాం. మే నెలాఖరు నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం" అని ప్రకటించారు. భూ సమస్యలను 'భూ భారతి' ద్వారా ప్రక్షాళన చేస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను రాబోయే 35 రోజుల్లో ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళా సాధికారతే లక్ష్యం...

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా వంటి పథకాలు పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును గరిష్టంగా మూడు నెలల వ్యవధిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు ను సందర్శించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

- **ప్రధాన న్యాయమూర్తిని మర్యాదగా కలిసి సత్కారం**
- **వేసవికాలం దృష్ట్యా కోర్టు ప్రాంగణంలో కక్షిదారులకు దద్దోజనం, పెరుగన్నం పంపిణీకి శ్రీకారం**



**ఖమ్మం బ్యూరో, మే 6(తెలంగాణ ముచ్చట్లు ):** జిల్లా ప్రధాన న్యాయస్థానాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు బుధవారం సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని జిల్లా జడ్జి సత్కరించారు.

కోర్టుకు వచ్చే కక్షిదారుల కోసం పెరుగన్నం పంపిణీ

వేసవికాలం తీవ్రమైన ఎండల దృష్ట్యా... జిల్లా ప్రధాన కోర్టుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కక్షిదారుల కోసం రామసహాయం కల్పనా రెడ్డి జ్ఞాపకార్థం ఏప్రిల్ 28న ప్రారంభమైన దద్దోజనం, పెరుగన్నం పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. స్వయంగా పలువురు కక్షిదారులకు వడ్డించారు. జూన్ ఒకటో తేదీ వరకు నిరంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, కక్షిదారులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ రూమ్ కు..

సొసైటీ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి ఆహ్వానం మేరకు సొసైటీ రూమ్ ను ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి సందర్శించారు ఈ కార్యక్రమంలో..:సీనియర్ న్యాయవాదులు స్వామి రమేష్ కుమార్, నిరంజన్ రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, సెక్రటరీ కొప్పుల రవి, దండ సుధాకర్, జిపి రవీందర్, పి పి శరత్ కుమార్ రెడ్డి, ఏజిపి రత్నాకర్, తాళ్లూరి దిలీప్, మహిళా న్యాయవాదులు ఊటుకూరి విజయలక్ష్మి, రాధమ్మ, దేవరకొండ కళ్యాణి, తన్నీరు లలిత, ప్రీతి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# జమ్మికుంటకు గుర్తుండిపోయే అధికారి... ఎస్ఐ సతీష్‌కు భావోద్వేగ వీడ్కోలు




**జమ్మికుంట టౌన్ మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పోలీస్ స్టేషన్ ఈ రోజు భావోద్వేగ క్షణాలకు వేదికైంది. ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ బదిలీ నేపథ్యంలో, సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించి, ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

పోలీస్ సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం సాదాసీదా వీడ్కోలు కాకుండా, ఒక సేవా యోధుడికి ప్రజలు, సహచరులు కలసి తెలిపిన గౌరవంగా నిలిచింది. పలువురు సిబ్బంది భావోద్వేగంతో సతీష్‌తో తమ అనుభవాలను పంచుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. జమ్మికుంటలో విధులు చేపట్టిన కొద్ది కాలంలోనే ఎస్ఐ సతీష్ ప్రజలకు చేరువై, సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా ఆలస్యం చేయకుండా స్పందిస్తూ, న్యాయం జరిగేలా కృషి చేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. క్రమశిక్షణతో పాటు మానవీయ దృక్పథం కలిగిన అధికారిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. కేవలం 10 నెలల వ్యవధిలోనే తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు సాధించిన సతీష్, పై అధికారుల ప్రశంసలతో పాటు ప్రజల ప్రేమను కూడా సంపాదించారు. ఇలాంటి అధికారి బదిలీ కావడం పట్ల స్థానికులు, సిబ్బంది కలత చెందారు. ఈ సందర్భంగా సహచరులు మాట్లాడుతూ, "మీరు మాకు కేవలం అధికారి కాదు, మార్గదర్శకులు... మీ సేవలు ఎప్పటికీ మాకు ఆదర్శం" అని ప్రశంసించారు. అనంతరం శాలువాతో సత్కరించి స్మారక చిహ్నం అందజేశారు. ప్రస్తుతం సతీష్ మిరుదొడ్డి ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. కొత్త బాధ్యతల్లో మరింత విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.



# గుంతలమయమైన బీటీ రోడ్డు.. ప్రమాదాలకు నిలయంగా మారిన మార్గం

- **ముందరితండా–చిన్నమందడి–దొడగుంటపల్లి రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్**

**పెద్దమందడి,మే6(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని ముందరి తండా నుంచి చిన్నమందడి, దొడగుంటపల్లి గ్రామాలకు వెళ్లే బీటీ రహదారి అధ్వాన్నంగా మారింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై గుంతలు ఏర్పడటంతో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.రాత్రి సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని పేర్కొన్నారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



# అధికారం శాశ్వతం కాదు.. మంచి పేరు శాశ్వతం

- **ప్రజల మధ్య ఉంటేనే నిజమైన ప్రజాసేవ అన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
- **అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమయ్యాయని వ్యాఖ్య**
- **వరంగల్ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తున్నామని వెల్లడి**

**వరంగల్, మే-06 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదలపై కీలక వ్యాఖ్యలు చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వరంగల్ నగరాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కూడా మంజూరైనట్లు వెల్లడించారు. నగరాభివృద్ధిలో భాగంగా విమానాశ్రయం, కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్ వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.
శానిటేషన్, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారిస్తోందని చెప్పారు. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. “అధికారం శాశ్వతం కాదు.. మంచి పేరు మాత్రం ఎప్పటికీ నిలిచిపోతుంది” అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య వ్యాఖ్యానించారు. ప్రజల మధ్య ఉంటూ సేవ చేస్తేనే నిజమైన ప్రజాసేవ అవుతుందని అన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కార్పొరేటర్లకు సూచించారు.
వరంగల్ నగరానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని పేర్కొంటూ వేయి స్తంభాల ఆలయ అభివృద్ధికి రూ.14 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కుల నిధుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిరంతరం కోరుతున్నామని తెలిపారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషితో విడుదల చేయిస్తున్నారని చెప్పారు. ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధితో మల్లేశం చికిత్సకు ఆర్థిక భరోసా

- **కాలేయం, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న బాధితుడికి ఎల్ఓసి మంజూరు**
- **మాజీ మంత్రి బసవరాజు సారయ్య చొరవతో స్పందించిన సీఎం కార్యాలయం**
- **కుటుంబ సభ్యులకు ఎల్ఓసి పత్రం అందజేత**

**వరంగల్, మే-06 (తెలంగాణ ముచ్చట్లు):** ఖిలా వరంగల్ మధ్యకోట యాదవ వీధికి చెందిన దేనబోయిన మల్లేశం కాలేయం, మూత్రపిండాల సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన చికిత్సకు సుమారు ఐదు లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు వెల్లడించడంతో కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యను సంప్రదించారు.
మల్లేశం కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య చికిత్స ఖర్చుల నిమిత్తం ఎల్ఓసి జారీ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం సీఎం సహాయ నిధి కింద చికిత్సకు అవసరమైన మొత్తానికి ఎల్ఓసి మంజూరు చేసింది. ఈ సందర్భంగా దేనబోయిన మల్లేశం కుమారుడు ప్రసాద్‌కు ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులు సీఎం కార్యాలయం, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.
అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా అనేక మంది నిరుపేదలకు వైద్య సహాయం అందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, ఐఎన్టీయూసీ నాయకులు బైరబోయిన చంద్రమౌళి, కూచన ఏకాంబరం, కాంద్రాతి లింగమూర్తి పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- **ధాన్యం కొనుగోలుపై అత్యవసర సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
- **అదనపు ట్రక్కులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు**
- **నర్మెట్ట, తరిగొప్పుల రైతుల కోసం మొక్కజొన్న కేంద్రం ఏర్పాటు**



**జనగామ, మే-06 (తెలంగాణ ముచ్చట్లు):** అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు.
అదనపు కలెక్టర్ బెన్షాలోంతో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా, మార్కెటింగ్, డిఆర్డిఓ, మార్క్ ఫెడ్ తదితర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం కురిసిన అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి వెంటనే మిల్లింగ్‌కు పంపించాలని సూచించారు. ఇప్పటికే ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక ట్రక్కు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు అదనపు ట్రక్కులు పంపించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు.
ధాన్యం దిగుమతిలో మిల్లర్లు రైతులకు ఇబ్బందులు కలిగించకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మిల్లును అధికారులు పరిశీలిస్తూ కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అకాల వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి కొనుగోలు కేంద్రంలో అదనపు టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఏఈఓలు ప్రతి రోజు కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు.
నర్మెట్ట, తరిగొప్పుల మండలాల రైతులకు ఉపయోగపడే విధంగా అనువైన ప్రదేశంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేసి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన మక్కలను నిర్దేశించిన గోదాంలలో భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిఓ, ఇంచార్జ్ డిఆర్డిఓ, పౌరసరఫరాల డిఎం, మార్కెటింగ్ అధికారులు, ఇంచార్జ్ మార్క్ ఫెడ్ అధికారి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# చంద్రుగొండ పీహెచ్‌సీపై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- **వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర పరిశీలన**
- **రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ అంకిత్**
- **ఖాళీ పోస్టుల భర్తీపై అధికారులకు ఆదేశాలు**



**భద్రాద్రి కొత్తగూడెం, మే-06 (తెలంగాణ ముచ్చట్లు):** చంద్రుగొండ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరును ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ విభాగాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యుల అందుబాటు, మందుల సరఫరా, చికిత్స విధానం వంటి అంశాలపై ఆరా తీశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి రిజిస్టర్లు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్లు, నర్సులు, ఖాళీ పోస్టులపై సమాచారం సేకరించారు. మందుల నిల్వ గదిని తనిఖీ చేసి అవసరమైన అన్ని ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ సేవల నిర్వహణపై కూడా కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ల్యాబ్ పరికరాలు, పరీక్షల సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రసూతి విభాగాన్ని సందర్శించి గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. హోమియో వైద్యశాలలో వైద్యుడు లేకపోవడాన్ని గుర్తించిన జిల్లా కలెక్టర్ ఆ పోస్టును త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. ప్రజలకు అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# గద్వాల్‌లో ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- **నెలవారీ తనిఖీలో భాగంగా గోడౌన్ సందర్శన**
- **ఈవీఎంల భద్రతపై అధికారులకు కీలక సూచనలు**
- **ఎన్నికల సామగ్రి సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశం**




**గద్వాల్, మే-06 (తెలంగాణ ముచ్చట్లు):** గద్వాల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఐఏఎస్ బుధవారం పరిశీలించారు. ఈవీఎంల నెలవారీ సాధారణ తనిఖీలో భాగంగా ఆయన గోడౌన్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.
ఈ సందర్భంగా ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ సూచించారు. యంత్రాల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గోడౌన్‌లో ఉన్న భద్రతా ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి అంశాలపై కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఎన్నికల విభాగం అధికారులు పాటిస్తున్న భద్రతా విధానాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు మంజుల, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులు స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# వేసవిలో ముఖానికి ఇన్‌స్టంట్ గ్లో... వంటింటి పదార్థాలతోనే సులభ పరిష్కారం

- తక్కువ ఖర్చులో సహజ సౌందర్య చిట్కాలు
- టానింగ్ తగ్గించే ఇంటి ప్యాక్స్
- చర్మానికి మెరుపు తీసుకువచ్చే పద్ధతులు



**డెస్క్, మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** వేసవిలో ఎండ తీవ్రత, చెమట కారణంగా ముఖం జిడ్డుగా మారి కాంతిని కోల్పోవడం సాధారణ సమస్యగా మారింది. బయటకు వెళ్లగానే సూర్యరశ్మి ప్రభావం వల్ల టానింగ్ కూడా పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్లర్‌లకు వెళ్లడం కష్టంగా అనిపించినా, మన వంటింట్లో ఉండే సాధారణ పదార్థాలతోనే తక్కువ ఖర్చులో ముఖానికి తక్షణ మెరుపు తీసుకురావచ్చని నిపుణులు సూచిస్తున్నారు. బంగాళదుంప సహజ బ్లీచింగ్ గుణాలు కలిగి ఉంటుంది. బంగాళదుంప రసాన్ని నేరుగా ముఖానికి రాసి కొంతసేపటి తర్వాత కడిగేస్తే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. అలాగే బియ్యప్పిండి, బంగాళదుంప రసం, కలబంద గుజ్జు, టమాటా రసం కలిపి పేస్ట్ తయారు చేసి వాడితే ముఖంపై ఉన్న మసకత్వం తగ్గి తక్షణ గ్లో కనిపిస్తుంది. నారింజ, నిమ్మ తొక్కలు విటమిన్ సి సమృద్ధిగా కలిగి ఉండటం వల్ల చర్మాన్ని లోపల నుంచి ఆరోగ్యంగా మార్చడంలో సహాయపడతాయి. వీటిని పేస్ట్‌గా చేసి కలబంద గుజ్జుతో కలిపి వాడితే టానింగ్ తగ్గుతుంది. ఈ పద్ధతిని వారానికి కొన్ని సార్లు పాటిస్తే చర్మం సహజ కాంతిని పొందుతుంది. మృత కణాలను తొలగించడానికి ఓట్స్ అద్భుతంగా పనిచేస్తాయి. ఓట్స్ పొడిలో తేనె, పాలు లేదా పెరుగు కలిపి స్క్రబ్‌గా వాడితే చర్మం మృదువుగా మారుతుంది. పెరుగులోని గుణాలు చర్మానికి తేమను అందించి, చక్కని ఛాయను ఇస్తాయి. టమాటా సూర్యరశ్మి ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. టమాటాను శనగపిండి, పసుపుతో కలిపి ముఖంపై మర్దన చేస్తే టానింగ్ త్వరగా తగ్గుతుంది. అలాగే పసుపు, పెరుగు మిశ్రమం పురాతన కాలం నుంచి ఉపయోగిస్తున్న సమర్థవంతమైన పద్ధతి. ఇది మొటిమలను తగ్గించి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ సహజ చిట్కాలను క్రమం తప్పకుండా పాటిస్తే వేసవిలో కూడా ముఖం తాజాగా, ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

# వేసవిలో కనకాంబరం గుత్తుల పూల సందడి... ఈ చిట్కాలతో మొక్క నిండా పూస్తుంది

- సరైన సూర్యరశ్మి–నీటి నియంత్రణ
- ఎరువులు, మట్టి మిశ్రమం ప్రాముఖ్యం
- తెగుళ్ల నివారణ–సంరక్షణ చిట్కాలు



**డెస్క్, మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** ఇళ్ల తోటల్లో అందంగా కనిపించే పూల మొక్కల్లో కనకాంబరం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. దీని ప్రకాశవంతమైన రంగు, ప్రత్యేక ఆకర్షణతో చాలా మంది ఈ మొక్కను పెంచుకుంటారు. ముఖ్యంగా వేసవికాలంలో కనకాంబరం మొక్క గుత్తులుగా పూలు పూసి తోటను మరింత అందంగా మార్చుతుంది. అయితే సరైన సంరక్షణ లేకపోతే పూల ఉత్పత్తి తగ్గిపోతుంది. కొన్ని సులభమైన పద్ధతులను పాటిస్తే మొక్క నిండా పూలు పూయడం సాధ్యమవుతుంది. కనకాంబరం మొక్క పుష్కలంగా పూయాలంటే సూర్యరశ్మి చాలా అవసరం. రోజుకు కనీసం ఐదు గంటలపాటు ప్రత్యక్ష సూర్యకాంతి అందేలా చూడాలి. అయితే తీవ్రమైన ఎండ ఉన్న రోజుల్లో మొక్కను నేరుగా ఎండలో ఉంచకుండా గ్రీన్ నెట్ కింద లేదా కొంత నీడలో ఉంచడం మంచిది. ఇలా చేస్తే మొక్క ఎండ వేడిమి నుండి రక్షణ పొందుతుంది. నీటి యాజమాన్యం కూడా కీలకం. నేల ఎప్పుడూ తేమగా ఉండాలి కానీ అధికంగా నీరు పోయకూడదు. పై మట్టి పొడిగా కనిపించినప్పుడు మాత్రమే నీరు పోయాలి. ఎక్కువ నీరు పోయడం వల్ల వేర్లు కుళ్ళిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి నీరు పోయేటప్పుడు మితంగా ఉండటం అవసరం. మొక్క ఆరోగ్యంగా పెరగడానికి సరైన మట్టి మిశ్రమం అవసరం. కంపోస్ట్, కోకోపీట్, ఇసుక, తోట మట్టి కలిపిన మిశ్రమం ఉపయోగిస్తే నీరు సరిగ్గా ఇంకి మొక్క బాగా ఎదుగుతుంది. వేపపిండి కలిపితే ఫంగస్ సమస్యలు తగ్గుతాయి. ఈ మిశ్రమం మొక్కకు పోషకాలను సమతుల్యంగా అందిస్తుంది. ఎరువుల వినియోగం పూల ఉత్పత్తిని పెంచుతుంది. నెలకు ఒకసారి కంపోస్ట్ ఇవ్వడం, పది నుండి పదిహేను రోజులకోసారి పొటాషియం ఆధారిత ఎరువులు వేయడం వల్ల మొక్క పుష్పించడం వేగంగా జరుగుతుంది. ఎప్సమ్ ఉప్పును ఉపయోగించడం ద్వారా ఆకులు పచ్చగా మెరిసి, మొక్క ఉత్సాహంగా పెరుగుతుంది. మొక్కను క్రమం తప్పకుండా సంరక్షించడం కూడా అవసరం. పూసిన పూలను వెంటనే తీసేయడం, ఎండిన కొమ్మలను కట్ చేయడం వల్ల కొత్త పువ్వులు ఎక్కువగా వస్తాయి. అలాగే పిండినల్లి వంటి తెగుళ్లు కనిపించినప్పుడు వెంటనే వేపనూనె ద్రావణం లేదా తగిన మందులు ఉపయోగించి నివారించాలి. ఈ విధంగా సరైన జాగ్రత్తలు తీసుకుంటే కనకాంబరం మొక్క సంవత్సరం పొడవునా గుత్తులుగా పూలతో మీ తోటను అలంకరిస్తుంది.

# ఎండాకాలంలో చల్లని ప్రదేశాల వైపు ప్రజల పరుగులు

- మండుతున్న ఎండల నుండి ఉపశమనం కోసం పర్యాటక యాత్రలు
- హిల్ స్టేషన్లు, ప్రకృతి ప్రాంతాలకు పెరిగిన డిమాండ్
- మానసిక ప్రశాంతత కోసం ప్రకృతి ఒడిలో విశ్రాంతి





**చెన్నై, మే 06 (తెలంగాణ ముచ్చట్లు):** ఎండాకాలంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నగరాల్లో కాంక్రీట్ నిర్మాణాలు, కాలుష్యం కారణంగా వేడి మరింతగా పెరుగుతుండటంతో ప్రజలు చల్లని ప్రదేశాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, కుటుంబాలు సెలవులను వినియోగించుకుని ప్రకృతి మధ్యలో గడపడానికి ఆసక్తి చూపుతున్నారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఊటీ, కొడైకెనాల్ వంటి హిల్ స్టేషన్లు ఎండాకాలంలో ప్రధాన ఆకర్షణగా మారాయి. ఇక్కడి చల్లని గాలి, మబ్బులతో కప్పబడిన కొండలు, టీ తోటలు పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తున్నాయి. ఉదయం పొగమంచు, సాయంత్రపు చల్లని వాతావరణం ప్రజలను ఆకట్టుకుంటోంది. అదేవిధంగా మున్నార్, కూర్గ్ ప్రాంతాలు కూడా సహజసిద్ధమైన సౌందర్యంతో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. పచ్చని అడవులు, జలపాతాలు, కాఫీ తోటలు ఈ ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయి. నగర జీవన ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రజలు ఈ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయ కూడా మంచి ఎంపికగా మారింది. కొండలు, గ్రీన్ వ్యాలీలు, కాఫీ తోటల మధ్యలో ఉన్న ఈ ప్రాంతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. రైలు ప్రయాణం మార్గమంతా ప్రకృతి అందాలతో నిండిపోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పర్యాటక రంగ నిపుణుల ప్రకారం, ఎండాకాలంలో చల్లని ప్రదేశాలకు డిమాండ్ ప్రతి సంవత్సరం పెరుగుతోంది. వాతావరణ మార్పులు, నగరాల్లో అధిక ఉష్ణోగ్రతలు దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. హోటళ్లు, రిసార్టులు ఈ సీజన్‌లో పూర్తిగా బిజీగా మారుతున్నాయి. మొత్తం మీద, ఎండాకాలంలో చల్లని ప్రదేశాలకు వెళ్లడం ఒక కొత్త జీవనశైలిగా మారుతోంది. ప్రకృతి మధ్యలో గడిపే సమయం శారీరక ఆరోగ్యానికి తోడు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

# ఒకే కాన్పులో నలుగురు శిశువులకు జన్మనిచ్చిన మహిళ



- నెలలు నిండకముందే పురిటి నొప్పులు
- ఇద్దరు మగబిడ్డలు.. ఇద్దరు ఆడబిడ్డలు
- దేవుడిచ్చిన వరమంటూ ఆనందం వ్యక్తం చేసిన తండ్రి


**షియోపూర్, మే-06 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని షియోపూర్ జిల్లాలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఒక మహిళ తన తొలి ప్రసవంలోనే ఒకే కాన్పులో నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. ఈ వార్త స్థానికంగా ఆసక్తి కలిగించగా, వైద్యులు కూడా దీనిని ప్రత్యేక సంఘటనగా పేర్కొన్నారు. వీర్‌పూర్ తాలూకా బేరుపుర గ్రామానికి చెందిన పూజ, హుకుమ్ సుమన్ దంపతులకు ఈ నలుగురు పిల్లలు జన్మించారు. ప్రసవానికి ఇంకా పూర్తి నెలలు కాకముందే పూజకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గర్భధారణకు ఏడు నెలలు కూడా పూర్తికాకముందే కాన్పు జరగడంతో శిశువుల ఆరోగ్యంపై భయం నెలకొంది. అయితే వైద్యుల పర్యవేక్షణలో జరిగిన ప్రసవంలో ఒకరి తర్వాత ఒకరు గంట వ్యవధిలో నలుగురు శిశువులు జన్మించారు. వారిలో ఇద్దరు మగబిడ్డలు కాగా, మరో ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు. షియోపూర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ప్రసవం జరిగింది. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో శస్త్రచికిత్స ద్వారా కాన్పు నిర్వహించడం జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. కానీ పూజకు సహజ ప్రసవం జరగడం విశేషమని తెలిపారు. ప్రసవం అనంతరం తల్లి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు. ప్రస్తుతం నలుగురు శిశువులూ ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. ఒక్కో శిశువు సుమారు ఒక కిలో బరువుతో జన్మించినట్లు వైద్యులు తెలిపారు. సాధారణ బరువుతో పోలిస్తే ఇది తక్కువ కావడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందించిన పిల్లల తండ్రి హుకుమ్ సుమన్ ఆనందం వ్యక్తంచేశారు. ఒకేసారి నలుగురు పిల్లలు జన్మించడం తమ కుటుంబానికి దేవుడిచ్చిన వరమని తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌కు బ్రేక్.. ట్రంప్ కీలక ప్రకటన

- ఇరాన్‌తో చర్చల్లో పురోగతి అంటున్న అమెరికా
- విదేశీ నౌకల రక్షణ చర్యల తాత్కాలిక నిలిపివేత
- పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులపై ప్రపంచ దృష్టి



**వాషింగ్టన్, మే-06 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న ఘర్షణల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆందోళన నెలకొన్న వేళ హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన విదేశీ నౌకలను రక్షించేందుకు అమెరికా ప్రారంభించిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలక మార్గంగా గుర్తింపు పొందిన హర్మూజ్ జలసంధి ఇటీవల తీవ్ర ఉద్రిక్తతలకు కేంద్రబిందువుగా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ తన సముద్ర మార్గాల భద్రతను కట్టుదిట్టం చేయడంతో అనేక విదేశీ నౌకలు జలసంధి పరిసరాల్లో చిక్కుకుపోయాయి. కొన్ని నౌకల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం పడింది. ముఖ్యంగా చమురు సరఫరా వ్యవస్థలో అంతరాయం కలగవచ్చన్న భయాలు ప్రపంచ మార్కెట్లను కుదిపేశాయి. ఈ పరిస్థితుల్లోనే అమెరికా 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' పేరుతో ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. విదేశీ నౌకలను సురక్షితంగా జలసంధి దాటించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని ప్రకటించింది. అమెరికా నౌకాదళం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ చర్యలను ట్రంప్ మానవతా కార్యక్రమంగా అభివర్ణించారు. ప్రపంచ దేశాల వాణిజ్య ప్రయోజనాలను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. అయితే ప్రాజెక్ట్ ప్రారంభమైన కొన్ని గంటలకే దానిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇరాన్‌తో కొనసాగుతున్న దౌత్య చర్చల్లో పురోగతి కనిపిస్తోందని, పూర్తి స్థాయి ఒప్పందం దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని ఆయన వెల్లడించారు. పాకిస్థాన్‌తో పాటు మరికొన్ని దేశాలు చేసిన అభ్యర్థనలను కూడా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదికలో చేసిన పోస్టులో ఇరాన్ ప్రతినిధులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని, పరిస్థితి మరింత విషమించకుండా చూసేందుకు అమెరికా చర్యలు తీసుకుంటోందన్నారు. అయితే ఇరాన్‌పై అమలులో ఉన్న సముద్ర దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఒప్పందంపై పూర్తి స్పష్టత వచ్చేంతవరకు అమెరికా తన వైఖరిలో మార్పు ఉండదని తెలిపారు. ఇక మీడియాతో మాట్లాడిన ట్రంప్ మరింత ఘాటైన వ్యాఖ్యలు చేశారు. బహిరంగంగా అమెరికాపై విమర్శలు చేస్తున్న ఇరాన్, రహస్యంగా ఒప్పందం కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అమెరికా పూర్తిస్థాయి సైనిక చర్యలకు దిగితే ఇరాన్ తట్టుకోలేదని హెచ్చరించారు. అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోమని చెప్పారు. మరోవైపు ట్రంప్ నిర్ణయాన్ని ఇరాన్ తన దౌత్య విజయంగా ప్రచారం చేసుకుంటోంది. అమెరికా ఒత్తిడికి లోనై ప్రాజెక్ట్‌ను నిలిపివేసిందని ఇరాన్‌కు చెందిన కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే అవకాశముందా లేక మరింత పెరుగుతాయా అన్న అంశంపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.



# నోబెల్ బహుమతి పొందిన తొలి భారతీయుడు

- రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి: విశ్వకవి అక్షరార్చన
- అద్భుత సాహితీ ప్రస్థానం
- జాతీయ గీతాల సృష్టికర్తకు నీరాజనం

**డెస్క్, మే 6 (తెలంగాణ ముచ్చట్లు):** విశ్వకవి, అక్షర శిల్పి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా సాహితీ ప్రేమికులు ఆయనను ఘనంగా స్మరించుకుంటున్నారు. అద్భుతమైన కావ్యాలు, గీతాలు, నాటకాలు, చిత్రలేఖనంతో భారతీయ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడు రవీంద్రుడు. 1861 మే 7న కలకత్తాలో జన్మించిన ఆయన, చిన్నతనం నుంచే అద్భుతమైన సృజనాత్మకతను చాటారు. కేవలం అక్షరాలకే పరిమితం కాకుండా, శాంతినికేతన్ వంటి విద్యా సంస్థను స్థాపించి విద్యా రంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు. బెంగాలీ సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించి, ఆధునిక భారతీయ సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన ఘనత ఠాగూర్ కే దక్కుతుంది.

రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'గీతాంజలి' కావ్యానికి 1913లో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి లభించింది. ఈ ఘనత సాధించిన తొలి ఆసియా వాసిగా ఆయన చరిత్ర సృష్టించారు. గీతాంజలిలోని భక్తి, మానవతావాదం పాశ్చాత్య ప్రపంచాన్ని సైతం మంత్రముగ్ధులను చేశాయి. ఆయన సాహిత్యం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, స్వేచ్ఛా స్ఫూర్తిని రగిలించే ఆయుధంగా మారింది. బ్రిటిష్ పాలనలో దేశప్రజలను మేల్కొల్పడానికి ఆయన తన కలంతో అలుపెరుగని పోరాటం చేశారు. సాహిత్యం ద్వారా జాతీయతా భావాన్ని పెంపొందించడంలో ఆయన పాత్ర అనన్యసాన్యం.

భారత జాతీయ గీతం 'జనగణమన'ను అందించిన ఘనత రవీంద్రునికే చెందుతుంది. భారతదేశానికే కాకుండా బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని కూడా ఆయనే రచించడం ఒక అరుదైన గౌరవం. రెండు దేశాలకు జాతీయ గీతాలను అందించిన ఏకైక కవిగా ఆయన ప్రపంచ చరిత్రలో నిలిచిపోయారు. సంగీతంపై ఉన్న మక్కువతో ఆయన రూపొందించిన 'రవీంద్ర సంగీతం' నేటికీ లక్షలాది మందిని అలరిస్తోంది. ఆయన గీతాల్లోని లాలిత్యం, భావుకత శ్రోతలను ఒక కొత్త లోకంలోకి తీసుకువెళతాయి. సంప్రదాయాలను గౌరవిస్తూనే ఆధునిక ఆలోచనలకు ఆయన పెద్దపీట వేశారు.

రవీంద్రుని జయంతిని బెంగాలీ క్యాలెండర్ ప్రకారం 'పొచీషే బోయిషాఖ్' అని ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌తో పాటు దేశవ్యాప్తంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ఆయన కవితలు, వ్యాసాలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకం. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఆయన ఆశయాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు ప్రయాణించడమే నిజమైన విద్య అని నమ్మిన గొప్ప తాత్వికుడు ఆయన. స్వేచ్ఛ అంటే కేవలం రాజకీయ స్వేచ్ఛే కాదు, మనసులో ఎలాంటి భయం లేని స్థితి అని ఆయన ప్రబోధించారు.

ప్రపంచ సాహితీ యవనికపై భారతీయ జెండాను రెపరెపలాడించిన ఠాగూర్ మనందరికీ గర్వకారణం. నేటికీ ఆయన రచనలు అనేక భాషల్లోకి అనువదించబడి ప్రపంచవ్యాప్త పాఠకులను ప్రభావితం చేస్తున్నాయి. శాంతి, అహింస, మానవత్వం అనే సూత్రాల మీద ఆయన నిర్మించిన సాహితీ సామ్రాజ్యం చిరస్మరణీయం. రవీంద్రుని జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తూ, ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవం. కళలు, సాహిత్యం ద్వారా సామాజిక మార్పు సాధ్యమని నిరూపించిన ఈ విశ్వకవి చిరకాలం ప్రజల హృదయాల్లో నిలిచిపోతారు. విశ్వకవి కలలుగన్న నవభారత నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలి. సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగించడానికి ఆయన రాసిన సాహిత్యం దిక్సూచిలా పనిచేస్తుంది. ప్రకృతిని ప్రేమిస్తూ, మానవ విలువలని కాపాడుకుంటూ జీవించడమే ఆయనకు మనం ఇచ్చే అతిపెద్ద కానుక. ప్రతి విద్యార్థి ఆయన జీవితాన్ని ఒక పాఠంగా నేర్చుకోవాలి. సృజనాత్మకతకు ఎల్లలు లేవని, సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన జీవితం నిరూపించింది. ఆయన స్మరణలో గడిపే ఈ రోజు ప్రతి భారతీయుడికి ఒక పండుగ వంటిది.

ఆధునిక విద్యారంగంలో ఆయన ప్రవేశపెట్టిన గురుకుల పద్ధతి నేటికీ ప్రాముఖ్యతను కలిగి ఉంది. విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, లలిత కళలపై అవగాహన ఉండాలని ఆయన కోరుకున్నారు. ప్రకృతి ఒడిలో నేర్చుకునే పాఠాలు మనసుపై గాఢమైన ముద్ర వేస్తాయని ఆయన నమ్మకం. అందుకే శాంతినికేతన్ ఒక అద్భుతమైన విద్యా క్షేత్రంగా విరాజిల్లుతోంది. అక్కడ చదువుకున్న ఎంతో మంది మేధావులు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందారు. భారతీయ విద్యా వ్యవస్థకు ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. చివరగా రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక వ్యక్తి కాదు, ఒక గొప్ప శక్తి. ఆయన ఆలోచనలు తరతరాలకు మార్గదర్శకంగా ఉంటాయి. సాహిత్యం, కళలు, సంగీతం ఇలా ఏ రంగాన్ని చూసినా ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. విశ్వమానవ సౌభాతృత్వం కోసం ఆయన చేసిన కృషిని ప్రపంచం ఎప్పటికీ మరువదు. ఆయన జయంతి వేడుకలు కేవలం ఉత్సవాలుగా కాకుండా, ఆయన ఆశయాల పునరంకిత దినంగా జరుపుకోవాలి. భారతజాతి గర్వించదగ్గ ఈ గొప్ప మనీషిని స్మరించుకుంటూ మన సంస్కృతిని కాపాడుకుందాం.

# బాడీ షేమింగ్

- రూపం కంటే వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం
- శారీరక ఆకృతిపై వేధింపులు ఒక సామాజిక జాడ్యం
- ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్న బాహ్య సౌందర్య ప్రాతిపదికలు
- అంతరంగ సౌందర్యమే అసలైన మానవత్వపు గుర్తింపు



**డెస్క్, మే6 (తెలంగాణ ముచ్చట్లు):** నేటి సమాజంలో వ్యక్తిని అంచనా వేసే తీరు పూర్తిగా మారిపోయింది. ఒక మనిషి సామర్థ్యం, తెలివితేటల కంటే వారి శారీరక ఆకృతికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎవరైనా సన్నగా ఉన్నా, లావుగా ఉన్నా, పొట్టిగా ఉన్నా లేదా నల్లగా ఉన్నా వారిని విమర్శించడం ఒక సరదాగా మారిపోయింది. దీనినే మనం 'బాడీ షేమింగ్' అని పిలుస్తున్నాం. ఇది కేవలం సరదాగా చేసే వ్యాఖ్య మాత్రమే కాదు, అవతలి వ్యక్తి మానసిక స్థితిని దారుణంగా దెబ్బతీసే ఒక సామాజిక దాడి. ప్రతి మనిషి తన శరీర ఆకృతి పట్ల గర్వంగా ఉండే వాతావరణం నేడు కరువవుతోంది. సమాజంలో పెరిగిపోతున్న ఈ వివక్షకు ప్రధాన కారణం అందంపై మనకున్న తప్పుడు అంచనాలు. సినిమాల్లో, ప్రకటనల్లో చూపించే కృత్రిమ అందమే అసలైన అందమని చాలామంది భ్రమపడుతున్నారు. సన్నని నడుము, తెల్లని రంగు ఉంటేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందనే భావన యువతలో వేళ్లూనుకుపోతోంది. ఈ క్రమంలో సహజసిద్ధమైన శారీరక మార్పులను కూడా వికారంగా చూడటం మొదలైంది. ప్రతి ఒక్కరి జన్యుపరమైన నిర్మాణం విభిన్నంగా ఉంటుందని, అందరూ ఒకేలా ఉండటం అసాధ్యమని గుర్తించడంలో మనం విఫలమవుతున్నాం.

సోషల్ మీడియా ప్రభావం వల్ల బాడీ షేమింగ్ తీవ్రత మరింత పెరిగింది. ఇతరుల ఫోటోల కింద అసభ్యకరమైన కామెంట్లు చేయడం, వారి రూపాన్ని హేళన చేయడం నిత్యకృత్యంగా మారింది. దీనివల్ల బాధితులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి, ఆందోళనకు లోనవుతున్నారు. కొందరు ఈ వేధింపులను తట్టుకోలేక సమాజానికి దూరంగా ఉంటున్నారు. తమ శరీరం పట్ల తామే అసహ్యం పెంచుకుని ఆత్మన్యూనతా భావంతో కుంగిపోతున్నారు. ఇది కేవలం బాధితుడి వ్యక్తిగత సమస్య కాదు, ఒక ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇది పెద్ద అడ్డంకి. బాడీ షేమింగ్ వల్ల ఎదురయ్యే అతి పెద్ద ప్రమాదం 'ఈటింగ్ డిజార్డర్స్'. సన్నగా ఉండాలనే ఒత్తిడిలో చాలామంది సరైన ఆహారం తీసుకోకుండా అనారోగ్యాల పాలవుతున్నారు. మరికొందరు బరువు తగ్గడానికి ప్రమాదకరమైన మందులు, సప్లిమెంట్లు వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. శారీరక ఆరోగ్యం కంటే బాహ్య రూపం ముఖ్యం అనుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ఆరోగ్యం అంటే బరువుతో సంబంధం లేని ఫిట్‌నెస్ అనే విషయాన్ని మర్చిపోతున్నారు. శరీరం ఇచ్చే సహకారాన్ని కాదని, అది ఎలా కనిపిస్తుందనే దానిపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు.

నిజానికి మనిషి అసలైన అందం వారి వ్యక్తిత్వంలో ఉంటుంది. ఎదుటివారి పట్ల మనం చూపే కరుణ, గౌరవం, మన నడవడిక మనల్ని గొప్పవారిని చేస్తాయి. రూపం అనేది కాలక్రమేణా మారిపోయేది, కానీ వ్యక్తిత్వం శాశ్వతంగా నిలిచిపోయేది. చరిత్రలో ఎందరో మహానుభావులు తమ శారీరక ఆకృతితో సంబంధం లేకుండా ప్రపంచాన్ని ప్రభావితం చేశారు. వారి తెలివితేటలు, పట్టుదల వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాయి. మనం ఒక వ్యక్తిని కలిసినప్పుడు వారి ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలే తప్ప వారి బరువుకు లేదా రంగుకు కాదు.

పాఠశాల స్థాయి నుండే పిల్లలకు బాడీ షేమింగ్ పట్ల అవగాహన కల్పించాలి. ప్రతి ఒక్కరి శరీరం విశిష్టమైనదని, దేనితోనూ పోల్చకూడదని వారికి నేర్పించాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ఇతరుల శారీరక లోపాలను ఎత్తి చూపడం తప్పు అని చిన్నప్పుడే గ్రహిస్తే భవిష్యత్తులో వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు. బాడీ పాజిటివిటీ (శరీర ఆకృతి పట్ల సానుకూలత) అనే అంశంపై తరచుగా చర్చలు జరగాలి. మనల్ని మనం ప్రేమించుకోవడం నేర్చుకున్నప్పుడే ఇతరులను కూడా గౌరవించగలం. ప్రకటనల సంస్థలు, సినీ పరిశ్రమ కూడా ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలి. కేవలం ఒకే రకమైన శరీర ఆకృతిని అందానికి ప్రామాణికంగా చూపడం మానుకోవాలి. సహజమైన చర్మ రంగులను, శారీరక మార్పులను అంగీకరించే విధంగా కంటెంట్ రూపొందించాలి. వైవిధ్యమే అందం అనే సూత్రాన్ని ప్రచారం చేయాలి. వాస్తవికతకు దగ్గరగా ఉండే పాత్రలను చూపడం ద్వారా సామాన్యుల్లో ఉండే ఆందోళనలను తగ్గించవచ్చు. అందం అనేది ఒక వ్యాపార వస్తువు కాకూడదు, అది ఒక వ్యక్తి ఆత్మగౌరవంతో ముడిపడి ఉండాలి. బాడీ షేమింగ్ బాధితులు కూడా ధైర్యంగా ఉండాలి. ఎవరో అన్న మాటల కోసం తమను తాము శిక్షించుకోకూడదు. మన శరీరం మనకు దేవుడిచ్చిన గొప్ప వరం, దానిని గౌరవించడం మన కనీస బాధ్యత. ఆరోగ్యంపై దృష్టి సారించాలి తప్ప ఇతరుల అంచనాల కోసం పాకులాడకూడదు. ఎవరైనా హేళన చేసినప్పుడు మౌనంగా ఉండకుండా గట్టిగా స్పందించాలి. స్వీయ ప్రేమే బాడీ షేమింగ్‌కు సరైన సమాధానం. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, అది రూపంతో సంబంధం లేనిదని గుర్తించాలి.

సమాజంలో మార్పు రావాలంటే మన ఆలోచనా ధోరణి మారాలి. ఒక వ్యక్తిని చూడగానే వారి రూపాన్ని కామెంట్ చేయడం మానుకోవాలి. సంభాషణలు కేవలం ఆరోగ్యకరమైన విషయాలపై, ఆలోచనలపై జరగాలి. సామాజిక మాధ్యమాల్లో కూడా సానుకూల వాతావరణాన్ని ప్రోత్సహించాలి. బాడీ షేమింగ్‌ను ఒక నేరంగా పరిగణించే స్థాయికి అవగాహన పెరగాలి. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో ఇతరుల మనోభావాలను గౌరవించేలా నడుచుకోవాలి. మనుషుల మధ్య అనుబంధాలు కేవలం బాహ్య ఆకర్షణపై ఆధారపడి ఉండకూడదు. ముగింపుగా చెప్పాలంటే బాడీ షేమింగ్ లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. రూపం అనేది కేవలం పైన ఉండే పొర మాత్రమే, అంతరంగమే అసలైన గని. మనుషులను వారి గుణగణాలను బట్టి అంచనా వేయడమే నాగరికత. ఈ మే 5న మనం తీసుకునే నిర్ణయం మన తోటి వారి పట్ల గౌరవపూర్వకంగా ఉండాలి. శరీరం ఆకృతితో పనిలేకుండా ప్రతి ప్రాణిని ప్రేమించడమే మానవత్వం. అందమైన మనసుతో ఆలోచిద్దాం, ఆత్మీయతతో కూడిన సమాజాన్ని నిర్మిద్దాం. ఆరోగ్యమే మహాభాగ్యం, ఆత్మవిశ్వాసమే మన కవచం.

# ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం




**డెస్క్, మే6 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా యువతను క్రీడల వైపు మళ్ళించడానికి, శారీరక దారుఢ్యంపై చైతన్యం కల్పించడానికి ప్రతి ఏటా మే 7న ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్స్ ద్వారా ప్రారంభమైన ఈ వేడుక క్రీడాకారుల ప్రతిభను గుర్తించడానికి ఒక గొప్ప అవకాశంగా నిలుస్తోంది. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. కేవలం పోటీలే కాకుండా ఆరోగ్యం, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించడానికి ఈ రోజు ఒక వేదికగా మారుతోంది. ఆధునిక జీవనశైలిలో ఫిట్‌నెస్ అనేది విలాసం కాదు, అది ఒక అవసరమని ఈ సందర్భంగా నిపుణులు గుర్తు చేస్తున్నారు. అథ్లెటిక్స్ అనేది కేవలం పరిగెత్తడం మాత్రమే కాదు, అది మనోబలానికి నిదర్శనం. యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి వివిధ దేశాల్లో ప్రత్యేక పోటీలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి సరైన శిక్షణ ఇస్తే ఒలింపిక్స్ వంటి వేదికలపై భారత్ సత్తా చాటే అవకాశం ఉంది. అథ్లెటిక్స్ దినోత్సవం ద్వారా చిన్నారులు క్రీడలను తమ కెరీర్‌గా ఎంచుకోవడానికి అవసరమైన ప్రోత్సాహం లభిస్తుంది. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల అనేక జీవనశైలి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. ఈ రోజున పరుగు పందాలు, లాంగ్ జంప్, హై జంప్ వంటి వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేయడం ద్వారా వారిలో ఉత్సాహాన్ని నింపుతారు. క్రీడలు అనేవి మనుషుల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయి. గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవడానికి ఇవి తోడ్పడతాయి. నేటి తరం స్మార్ట్‌ఫోన్లకే పరిమితం కాకుండా మైదానాల్లోకి వచ్చి తమ ప్రతిభను చాటుకోవాలని పలువురు ప్రముఖ క్రీడాకారులు పిలుపునిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా క్రీడా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి యువతకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. క్రీడలు మనిషికి సహనం, పట్టుదల నేర్పుతాయి. కష్టాల్లో ఉన్నప్పుడు కుంగిపోకుండా ఎదురుదెబ్బలను తట్టుకుని నిలబడే ధైర్యం మైదానంలోనే నేర్చుకోవచ్చు. అథ్లెటిక్స్ ద్వారా లభించే క్రమశిక్షణ జీవితంలోని అన్ని రంగాల్లో రాణించడానికి ఉపయోగపడుతుంది. ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తీర్మానం తీసుకోవాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రాన్ని పాటిస్తూ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే మనం ఒక బలమైన, శక్తివంతమైన దేశాన్ని నిర్మించగలము. క్రీడాకారులకు లభించే గౌరవం దేశ ప్రతిష్టను పెంచుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. క్రీడారంగంలో రాణిస్తున్న అథ్లెట్లకు తగిన ప్రోత్సాహకాలు అందించడం వల్ల మరిన్ని అద్భుతాలు సృష్టించవచ్చు. అథ్లెటిక్స్ దినోత్సవం అనేది కేవలం ఒక రోజు వేడుకగా మిగిలిపోకూడదు. ప్రతిరోజూ క్రీడల పట్ల మక్కువ చూపిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ఈ దినోత్సవ అసలు లక్ష్యం. పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ఒక తప్పనిసరి అంశంగా చేస్తే భవిష్యత్తులో మన దేశం నుంచి మరెంతో మంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారవుతారు. క్రీడా స్ఫూర్తిని చాటుతూ ఆరోగ్యవంతమైన సమాజం వైపు అడుగులు వేయడమే ఈ రోజు మనం ఇచ్చే గొప్ప సందేశం. అందరం కలిసి క్రీడలను ఆదరిద్దాం, క్రీడాకారులను ప్రోత్సహిద్దాం. మైదానంలో చెమట చిందించడం వల్ల కలిగే ఆనందం వర్ణనాతీతం. క్రీడల వల్ల ఒత్తిడి తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ముఖ్యంగా గ్రామీణ యువతకు అథ్లెటిక్స్ రంగం అపారమైన అవకాశాలను కల్పిస్తోంది. సరైన మార్గదర్శకత్వం ఉంటే మన పల్లెటూరి ప్రతిభ ప్రపంచ యవనికపై మెరుస్తుంది. శిక్షకులు కూడా కొత్త సాంకేతికతను జోడించి క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలి. సాధన చేస్తే అసాధ్యమైనది ఏదీ లేదని నిరూపించడానికి క్రీడలే సరైన వేదిక. నిరంతర కృషి, పట్టుదల ఉంటే ఒలింపిక్ పతకాలు సాధించడం కష్టమేమీ కాదు. యువత తమ కలను నిజం చేసుకోవడానికి క్రీడలను ఒక మార్గంగా ఎంచుకోవాలి. శారీరక శ్రమ లేని జీవనం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని నివారించడానికి నడక, పరుగు వంటి అథ్లెటిక్ అంశాలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రతి రోజూ కనీసం గంట సమయం క్రీడల కోసం కేటాయించడం వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. అథ్లెటిక్స్ దినోత్సవ సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలను చదువుతో పాటు ఆటల్లో ప్రోత్సహించాలి. ఆటలు ఆడే పిల్లల్లో ఏకాగ్రత, చురుకుదనం ఎక్కువగా ఉంటాయని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలే కీలకమని అందరూ గుర్తించాలి. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అథ్లెట్ల జీవిత చరిత్రలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. వారు పడ్డ కష్టం, చూపిన పట్టుదల మనలో ధైర్యాన్ని నింపుతాయి. ప్రతి అడ్డంకిని అధిగమించి పతకాలు సాధించిన వారి గాథలు చదివితే మనకూ ఏదో ఒకటి సాధించాలనే తపన కలుగుతుంది. అథ్లెటిక్స్ దినోత్సవం అటువంటి స్ఫూర్తిని రగిలించే ఒక గొప్ప సందర్భం. క్రీడా రంగానికి కేటాయించే నిధులు దేశ భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడి వంటివి. నాణ్యమైన శిక్షణ, మెరుగైన వసతులు కల్పిస్తే భారత క్రీడాకారులు అగ్రస్థానంలో నిలుస్తారు. క్రీడల వైభవాన్ని కాపాడుకుంటూ ముందడుగు వేద్దాం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# నితిన్ కొత్త సినిమా ఘనంగా ప్రారంభం

యంగ్ హీరో నితిన్ కథానాయకుడిగా రూపొందుతున్న కొత్త చిత్రం నేడు ఘనంగా ప్రారంభమైంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్ల పై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రారంభోత్సవ కార్యక్రమం పూజా కార్యక్రమాలతో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు చిత్ర యూనిట్ సభ్యులు హాజరై సందడి చేశారు. ఈ సినిమాతో సోము నర్రి దర్శకుడిగా పరిచయం అవుతుండగా, 'అశోకవనంలో అర్జున కళ్యాణం'తో గుర్తింపు పొందిన రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతాన్ని సురేష్ బొబ్బిలి అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, మే రెండో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. కథ, నటీనటులు, సాంకేతిక బృందం కలసి ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడేలా చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న సితార సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను కూడా భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు సిద్ధమైంది. నితిన్‌కు మంచి కమర్షియల్ విజయాన్ని అందించేలా ఈ సినిమాను రూపుదిద్దుతున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఇతర నటీనటులు మరియు సాంకేతిక బృందం వివరాలను అధికారికంగా ప్రకటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. మొత్తానికి, ఈ కొత్త ప్రాజెక్ట్‌తో నితిన్ మరో హిట్ సాధిస్తాడా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.




# 'లెనిన్' నుంచి హీరోయిన్ ఫస్ట్ లుక్ విడుదల

అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'లెనిన్' చిత్రం నుంచి తాజా అప్‌డేట్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు రూపొందిస్తున్న ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న భాగ్యశ్రీ భోర్సె పుట్టినరోజు సందర్భంగా ఆమెకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.

ఈ చిత్రంలో భాగ్యశ్రీ 'భారతి' అనే పాత్రలో కనిపించనుండగా, విడుదలైన పోస్టర్‌లో ఆమె సాంప్రదాయిక లుక్‌లో ఆకట్టుకుంటోంది. మీసాలతో పద్ధతిగా కనిపించిన ఈ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఆమె పాత్ర కథలో కీలక మలుపులు తీసుకురానుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక అఖిల్ తన కెరీర్‌లో తొలిసారిగా చిత్తూరు ప్రాంతం నేపథ్యంగా సాగే రగ్గడ్ మాస్ పాత్రలో కనిపించనున్నాడు. అతని పాత్రతో పాటు 'భారతి' పాత్ర కథను ఎలా ప్రభావితం చేస్తుందన్నదే చిత్రంలో ప్రధాన ఆకర్షణగా మారనుంది.

జూన్ 26, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుండగా, అఖిల్ కెరీర్‌లో ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'ఎల్లమ్మ'లో హీరోయిన్ క్లారిటీ.. మృణాల్ దాదాపు ఫైనల్



'బలగం' సినిమాతో భావోద్వేగాలను హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న దర్శకుడు వేణు యెల్దండి, తన రెండో ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్న 'ఎల్లమ్మ' చిత్రంతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే టాలీవుడ్‌లో ఆసక్తికర చర్చలకు దారితీస్తోంది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై నెలకొన్న ఉత్కంఠ ఇప్పుడు ముగిసే దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో కథకు కీలకమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న మహిళా పాత్ర కోసం దర్శకుడు ఎంతో జాగ్రత్తగా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. మొదట ఈ పాత్ర కోసం సాయి పల్లవిని సంప్రదించినట్లు వార్తలు వచ్చినప్పటికీ, తేదీల సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కు దూరమైనట్లు సమాచారం. ఆ తరువాత కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించగా, ఒక దశలో ఆమె ఎంపిక దాదాపు ఖాయమని కూడా ప్రచారం జరిగింది. అంతేకాకుండా శృతి హాసన్, భాగ్యశ్రీ భోర్సే, రుక్మిణి వసంత్ వంటి పలువురు నటీమణుల పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు తెలిసింది. అయితే తాజా సమాచారం ప్రకారం 'సీతారామం' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ ఈ పాత్రకు దాదాపు ఖరారైనట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసే సామర్థ్యం ఉన్న మృణాల్, ఈ సినిమాకు పెద్ద బలం అవుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఆమె ఎంపికపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది. ఈ చిత్రంలో మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న అంశం ఏమిటంటే, ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'పార్శి' అనే శక్తివంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన లుక్‌కు మంచి స్పందన లభించింది. అంతేకాకుండా, ఈ చిత్రానికి సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు. 'ఎల్లమ్మ' సినిమా తెలంగాణ సంప్రదాయాలు, జానపద కళలు, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథగా తెరకెక్కుతోంది. గ్లింప్స్‌లో చూపించిన వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల శబ్దాలు వంటి అంశాలు సినిమాకు ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టించాయి. గ్రామీణ సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది.



# నేహా శెట్టి ఫోటోలు వైరల్

యువ నటి నేహా శెట్టి తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారుతున్నాయి. గ్లామర్‌తో పాటు స్టైలిష్ లుక్‌లో కనిపించిన ఆమె చిత్రాలు అభిమానులను ఆకట్టుకుంటూ, నెటిజన్ల నుంచి విపరీతమైన స్పందనను దక్కించుకుంటున్నాయి.డైరెక్టర్ పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి హీరోగా వచ్చిన 'మెహబూబా' సినిమాతో నేహా శెట్టి తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, తర్వాత సిద్ధు జొన్నలగడ్డతో కలిసి నటించిన 'డీజే టిల్లు' చిత్రంతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా 'రాధిక' పాత్రలో ఆమె నటన, గ్లామర్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి.ఆ తరువాత కొన్ని తెలుగు సినిమాల్లో నటించినప్పటికీ, పెద్ద విజయాలు మాత్రం అందుకోలేకపోయింది. కొంతకాలంగా ఆమెకు అవకాశాలు తగ్గినట్లు కనిపిస్తోంది. పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఓజీ' సినిమాలో ఒక ప్రత్యేక గీతంలో కనిపించినప్పటికీ, సినిమా నిడివి కారణంగా ఆ సన్నివేశాన్ని తొలగించినట్లు సమాచారం.అయితే సినిమాల కంటే సోషల్ మీడియాలో మాత్రం నేహా శెట్టి యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోలు ట్రెండ్ అవుతుండగా, అభిమానులు ప్రశంసలతో పాటు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.మొత్తానికి, సినిమాల్లో అవకాశాలు తగ్గినా గ్లామర్, సోషల్ మీడియా యాక్టివిటీతో నేహా శెట్టి తన క్రేజ్‌ను కొనసాగిస్తూ దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో మంచి ప్రాజెక్టులతో ఆమె మళ్లీ బలంగా రీ-ఎంట్రీ ఇస్తుందా అన్నది చూడాలి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in